# కాపీల కాశీపతి!

కాశీపతి కాపీలు కొట్టటంలో సిద్ధహస్తుడు. ఏనాడు పుస్తకం చేత పట్టుకుని చదివిన పాపాన పోలేదు!

పాకెట్‌మార్‌గాళ్ళు 'పర్స్'కొట్టేసినంత 'నేక్'గ... పడుచు పిల్లని చూచి పోకిరీలు కన్ను గీటినంత సులువుగా... ఎగ్జామ్స్‌లో కాపీకొట్టి పాసవటంలో ఆరితేరినవాడు. ఇన్ని మాటలు అనవసరం! కాపీ కొట్టటం తన జన్మహక్కుగ భావిస్తాడు కాశీపతి!

తండ్రి కాలేజీ ప్రిన్సిపాల్! బహుభాషా కోవిదుడు. అలాంటి పెద్దమనిషి కడుపున చెడబుట్టినవాడే కాశీపతి!

విశ్వనాథశాస్త్రి అంటే ఎందరికో ఆరాధ్యుడు. అటువంటి మహానుభావుడి కడుపున పుట్టిన శుంఠ కాశీపతి!

ఒక్కగానొక్క కొడుకు కదాని తల్లీతండ్రి ముద్దు చేయటంతో అచ్చోసిన ఆబోతులా తయారయ్యాడు.

తండ్రి ఇంట్లో వున్నంతసేపు చేతిలో పుస్తకం నలిగిపోతూంటుంది. మనసు చేతిలో వున్న పుస్తకంమీద లగ్నంకాదు. చదువును నిర్లక్ష్యం చేసినా కాపీ కొట్టి పాసవగలడనే ధీమా!

శాస్త్రిగారి కొడుకని తెలీటంవల్ల బాహాటంగ కాపీలు కొడుతున్నా ఎగ్జామినేషన్ హాల్లో వున్న టీచర్ల వాచర్లు చూచీ చూడనట్టు వుండేవారు.

ఎట్లాగైతేనేం కాపీల డ్రామాతో డిగ్రీలోకొచ్చాడు కాశీపతి! విద్యపట్ల శ్రద్ధలేకపోయినా కనీసం డిగ్రీ అయినా చేతికొస్తే బ్రతుకు బాటకి ఏదోవిధంగా ఉపయోగపడక పోతుందా... నాలుగు డబ్బులు సంపాదించుకోలేకపోతాడాని శాస్త్రిగారు మనసులో సరిపెట్టుకోకతప్పలేదు.

మొత్తానికి కాపీల ధర్మమాని డిగ్రీ మంచి మార్కులతో గట్టెక్కేడు. ఇకపై చదివేదిలేదని... కాపీ కొట్టగల శక్తి తనకు లేదని ఓరోజు తల్లితో తేల్చి చెప్పాడు.

'అముక్కే మీ నాన్నగారితో చెప్పి ఏడవరాదూ?... అడంగి వెధవకుమల్లే నా దగ్గర వాగకపోతే...' కాశీపతిని తల్లి చీవాట్లు పెట్టింది.

'తర్వాత ఏం చేయాలనుకుంటున్నావురా పతీ...?' తండ్రి నిలదీసాడు.

నోటమాట రాని కాశీపతి ఓ క్షణం ఆలోచించి బుర్ర గోక్కుని దిక్కులు చూస్తూ 'జర్నలిస్ట్

కావాలని వుంది...' గొణిగినట్టు మాట్లాడేడు.

"జర్నలిజమంటే ఆషామాషీ కాదోయ్! బోలెడంత బుర్ధీ... జ్ఞానం... తెలుగు భాష మీద పట్టు వుండి ఏడవాలి! నీకేమో పొట్ట పొడిస్తే అక్షరం ముక్క రాదాయె!?... అలాంటప్పుడు జర్నలిస్టుగా ఏం అఘోరిస్తావ్?... పోనీ నాకు తెల్సిన పత్రికాఫీసులో ప్రూఫ్ రీడర్‌గా చేరిపోతావేమిటి?... ఎట్లాగో అట్లా అందులోనే పైకి రావచ్చు నీకు తెలివితేటలు వుంటే...?" మెత్తగ చీవాట్లు పెడుతున్న ధోరణితో మాట్లాడేడు విశ్వనాథశాస్త్రి.

'అఫ్టాల్ ప్రూఫ్‌రీడర్ వుద్యోగమా....' నోరు జారాడు కాశీపతి.

"నోర్ముయ్యరా! విషయం తెలీకుండా మాట్లాడకు. టైలర్ కావాలంటే కాజాలు తీయటం గుండీలు కుట్టటం నేర్చుకోవాలి! వంట చేతనవాలంటే గిన్నెలు తోమటంలో అభ్యాసం వుండాలి! అలాగే ఇదీనూ! ప్రూఫ్‌రీడర్ కాలేని వాడు ఎడిటర్‌స్థాయికి ఎదగలేడు. 'ప్రూఫ్‌రీడింగ్' అనేది గొప్పకళ! చేరబోయే వుద్యోగంలో శ్రద్ధాసక్తులు కనబరుచు చాలు! అందులోనే పైకొస్తావ్..." క్లాసు పీకాడు విశ్వనాథశాస్త్రి.

తండ్రి ఎడాపెడా వాయిస్తూంటే కిక్కురుమన్లేదు కాశీపతి! ముఖం తోటకూర కాడలా వాడిపోయింది!

ఇంతలో తల్లి .శారదాంబ సీన్లోకొచ్చింది.

'ఏమిటీ!... పోయి పోయి ప్రింటింగ్‌ప్రెస్‌లోనా మనవాడికి వుద్యోగం ఇప్పించేది?... గ్రీటింగ్‌కార్డు... శుభలేఖలు అచ్చేస్తూ కూర్చుంటాడా ఏమిటి? పోయి పోయి ఆ ముష్టి వుద్యోగం చేయాల్సిన ఖర్మ మనవాడికేమిటండీ..." దీర్ఘాలు తీస్తూ భర్తతో వాదనకు దిగింది.

తల్లి తనకు వత్తాసొచ్చినందుకు కాశీపతి ముఖం కమలంలా విప్పారింది.

"నువ్వనుకుంటున్నట్టు అది ప్రెస్ కాదే-! పేద్ద పత్రికాఫీసు. ఆంధ్రదేశంలో పేరున్న దినపత్రిక ఆఫీసది. ఇరవై జిల్లాల్లో బ్రాంచీలున్నయ్. అక్కడ అనేక రకాల వుద్యోగాలు ఏడుస్తయ్. మనవాడిని అందులో చేరిస్తే ఏనాటికైనా పైకొచ్చి అఘోరిస్తాడు. కాళ్ళముందున్న దాన్ని కాదని తల్లీకొడుకులు గొంతెమ్మ కోరికలతో కలలు కంటూంటే... కాశీకి వయసు మించిపోయి అసలే ఉద్యోగమూరాక అఘోరిస్తాడు. అర్థమైందా?..." కళ్ళు పెద్దవి చేసి భార్యవేపు చూస్తూ పులిలా గాండ్రించాడు శాస్త్రిగారు.

"బొత్తిగ ముందాలోచన లేని మనిషి మీరు. నామాట విని ఆ వుద్యోగంలో చేరేముందే పిల్లవాడికి పెళ్ళి చేద్దాం!"

భార్య మాట విన్న శాస్త్రిగారికి నవ్వు కోపం రెండూ ఏకకాలంలో వచ్చినయ్. అయినా

తనను తాను సంబాళించుకుంటూ "పనీపాటలేని వెధవకు పిల్లవెవడిస్తాడే? నేను నిన్ను చేసుకున్న రోజులు కావివి! ఆడపిల్లలు తెలివి మీరేరు. ఇప్పుడు... అమ్మాయికి అబ్బాయి నచ్చాలి! అందచందాల్లో కాదు సుమా!?... వేలకు వేలు సంపాదించి తెచ్చి వొడిలో పోసే మగాళ్ళనే ఇష్టపడుతున్నారు తెలుసా...?"

"మనకు మాత్రం ఏం తక్కువని?- పదెకరాల సుక్షేత్రమైన మాగాణీ పొలం... సిటీ నడిబొడ్డున గల లంకంత కొంప వున్నయ్! వీటిని చూసైనా మంచి సంబంధం రాకపోదు..." కళ్ళు తిప్పుతూ నడ్డిన చేయి పెట్టుకుని జవాబిచ్చింది శారదాంబ.

"ఆ వున్నది కాస్త ఇప్పుడే వీళ్ళ చేతుల్లో పెడితే ఆ తర్వాత మన చేతికి చిప్పే...' పరిహాసంగా అన్నాడు శాస్త్రిగారు.

"ఇల్లు పొలం కొడుక్కు ఇచ్చేసినా... మనిద్దరం బతకటానికి మీకొచ్చే పింఛను చాలదా ఏం?..."

"సరేసరే నీ బడాయి మాటలకేం గాని... నువ్వెళ్ళి కాస్తంత వేడి కాఫీ పట్రా... తల పగిలిపోతోంది".

భర్త ఆర్డరేసాక ఇక తాను అక్కడెందుకు అనేసి వంటింట్లోకెళ్ళింది కాఫీ తేవటానికి!

★★★★★

మనసులో తనకు ఇష్టంలేకపోయినా తండ్రిపోరు భరించలేక పత్రికాఫీసులో ప్రూఫ్‌రీడర్ వుద్యోగంలో చేరక తప్పలేదు కాశీపతి!

నెలకు రెండువేల రూపాయల జీతానికి కుదిరాడు. తీరా చేరిన కొద్దిరోజులకే వుద్యోగంలో వున్న రంజు ఏమిటో అర్థమైంది.

తంతే గారెలబుట్టలో పడ్డ సామెతగా కాశీపతి అదృష్టానికి వీక్లీ సెక్షన్లో జాయినైనాడు. అక్కడ తనకంటే సీనియర్లు పని బాగా తెల్సినవాళ్ళు... కథలకి బొమ్మలేసే ఆర్టిస్టులు... పత్రికాఫీసుకొచ్చే కథలు... నవలలు... వ్యాసాలు... జోక్స్ వగైరా వగైరా చూచి సెలక్ట్ చేసేవాళ్ళు... వీరందరిమీద ఓ మహిళా సంపాదకురాలు వున్నారు.

ఆమె ధోరణే కాశీపతికి బొత్తిగా నచ్చి చావలేదు. బాబ్డు హెయిర్... పెదాలకు లిప్‌స్టిక్... దొరసానికి మల్లే గౌను... హైహీల్స్... వచ్చీరాని మాట్లాడే తెలుగు... అసలు ఈవెడగారెలా ఎడిటరైందో అర్థంకాలేదు. అయిదు నిముషాలకొకమారు ఒక్కొక్కర్ని తన కేబిన్లోకి పిలిచి చెడామడా వాయించటం... చిన్నా పెద్దా లేకుండా అందరినీ 'మిస్టర్...మిస్టర్' అంటూ సంబోధించటం అస్సలు నచ్చి చావలేదు.

ఆమెగారి పేరు 'మార్గెట్'! ఆమె ఎందులో గ్రేటో కాశీపతికి ఎంత నెత్తి బాదుకున్నా అర్థంకాలేదు. తర్వాత తెల్సింది... పత్రిక ఎం.డీ. గారికి ఆమెగారు చాలా బాగా దగ్గర మనిషీ అని. అందుకే ఆమెగారంటే అందరికీ హడల్! ఆమెగారు పెత్తనం చెలాయించినా అందరూ సర్దుకుపోతుంటారు. కాదని ఎదురు తిరిగితే నూకలు చెల్లిపోతయ్. తాను జాయినైన తర్వాతే ఒకరిద్దరు 'వూస్టై' పోయారు.

కాశీపతి బహుమంచి బాలుడిగ ఎడిటర్ దృష్టిలో పడ్డాడు. తనను ప్రత్యేక దృష్టితో చూసేది. పని నేర్చుకోమని ప్రోత్సహించేది. అందరి సంగతి ఎట్లావున్నా... తనను మాత్రం అత్యంత ఆప్యాయంగ 'కాశీ.... కాశీ" అంటూ పిలిచేది.

ఆమె కనుసన్నల్లో మెలుగుతూ చెప్పుచేతల్లో వున్నందుకు ఎం.డి.గారికి రికమెండ్ చేసి కాశీపతికి సబ్ ఎడిటర్ ప్రమోషనిప్పించింది.

తెలుగు రాయటం... చదవటం పెద్దగా వచ్చి చావదు గనుక కథల సెలక్షన్ విషయంలో తనకే నిర్ణయాధికారం ఇచ్చేసింది. ఇంకేముంది?... తంతే గారెలబుట్టలో పడ్డట్టయింది కాశీపతికి!

రోజూ పోస్టులో వచ్చే టన్నుల కొద్దీ కథలు చదవలేక కాశీపతి దుంప తెగిపోతోంది. కథలు చదివి చదివి రాటుదేలాడు. తను మాత్రం రచయిత ఎందుకు కాకూడదూ? అనే ప్రశ్న కాశీపతిలో ఉదయించింది. కొన్నాళ్ళకు కథా రచన చేయాలనే దురద... తామరగ మారి శరీరమంతా పాకింది.

తీయంగ తీయంగ రాగం... మూల్గంగ మూల్గంగ రోగం లాగ... చదవగా చదవగా కథలు ఎలా వ్రాయాలో చిట్కా వైద్యాన్ని కనుగొన్నాడు.

ప్లాట్స్ కోసం బుర్ర బద్దలు కొట్టుకోవలసిన అవసరం కనిపించలేదు కాశీపతికి.

ప్రచురణార్థం వచ్చే కథలను చదివి పాత్రలపేర్లు మార్చి... టైటిల్ మార్చి... ముగింపు మార్చి... పెన్ నేమ్‌తో ఇతర పత్రికలకు పంపటం షురూ చేసిన కాశీపతికి అదృష్టం కలిసొచ్చింది.

నచ్చని కథలను... పత్రికలో ఎటూ అచ్చువేసే అవకాశం లేదు గనుక... స్వంత చిరునామా గల కవరు తపాలాబిళ్లలు అతికించి రచయితలు కథకి జతచేయని స్క్రిప్టని హస్తలాఘవంతో తెలివితేటలతో తాను వ్రాసినవిగా పబ్లిష్ చేసుకోనారంభించిన కాశీపతి అనతికాలంలోనే మాంఛి కథారచయితగ మార్కెట్లోకొచ్చాడు. కాపీ కొట్టే అలవాటు చిరుతప్రాయం నుంచీ వున్నవాడు కాబట్టి రిజక్టెడ్ స్టోరీస్‌ని అతినునాయాసంగా కాపీ కొడుతూ చెలామణీ

అవుతున్నాడు.

ఇంత స్వల్ప కాలంలో కాశీపతి పాపులర్ రైటర్ ఎలా కాగలిగేడాని అదే పత్రికాఫీసులో పనిచేస్తున్న సీనియర్ సబ్ఎడిటర్లకి అనుమానం వచ్చి... నిఘావేసి... కాపుకాచి తీగలాగేరు. ఇంకేముంది డొంకంతా కదిలింది.

కాశీపతి కథాచౌర్యం బైటపడింది! తమకంటె వెనక వచ్చినవాడు... తమకి జూనియర్ అయిన సబ్ఎడిటర్ కాశీపతి కథా రచయితగా వెలిగిపోవటం చూస్తూ సీనియర్లు కళ్ళల్లో నిప్పులు పోసుకున్నారు.

కాశీపతి కాపీ కథల వ్యవహారాన్ని బైట పెట్టి అతగాడిని ఎలాగైనా బదనామ్ చేయటానికి తోటివారు కంకణం కట్టుకున్నారు. పత్రికాఫీసులో వెన్నుపోటుదారులు... అనుకూలశత్రువులు వున్న సంగతి అమాయక కాశీపతి పసికట్టలేకపోయాడు.

ఎం.డి.గారు వన్ఫైన్ మార్నింగ్ కాశీపతిని తన ఛేంబర్లోకి పిలిపించి చెడామడా తిట్టారు. ఆ విధంగా చేయటం పత్రిక ఎథిక్స్కి వ్యతిరేకమంటూ ఎం.డి.గారు క్లాసు పీకారు.

తిట్లకి కాశీపతి ముఖం అట్ల పెనంలాగ మాడిపోయింది. నోరు మెదపలేకపోయినా... కథాచౌర్యానికి పాల్పడటంలేదని బొంకేడు.

ఉద్యోగం పీకేస్తానంటూ ఎం.డీ.గారు బిల్డింగ్ పైకప్పు ఎగిరిపోయేలా అరిచి కేకలు పెట్టి రాద్ధాంతం చేసారు.

సూదిమొనంతటి సందైనా ఇవ్వకుండా కాశీపతి జాగ్రత్తపడి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

కొత్తగా పెళ్ళయినవాడని... వుద్యోగం పోతే అవమానం భరించలేక... ఆత్మహత్యే శరణ్యమౌతుందని లబోదిబోమన్నాడు.

కాశీపతి వగల ఏడుపులకు ఐస్ముక్కలా కరిగిపోయిన ఎం.డి.గారు ఈసారికి వదిలేస్తున్నానంటూ వార్నింగిచ్చి వదిలేయటంతో బ్రతుకుజీవుడాంటూ ఎం.డి.గారి ఏ.సీ.రూంలోంచి బైటపడ్డాడు.

తాను ఇతర రచయితలు పత్రికకు పంపే కథలు కాపీ కొడుతున్న విషయం ఎం.డి.గారికి ఎలా తెలిసిందో ఎంత బుర్ర బద్దలు కొట్టుకుని ఆలోచించినా కాశీపతికి బోధపడ్లేదు. బైటికొచ్చాక దులిపేసుకున్నాడు. తిట్లన్నీ గాలికొదిలేసాడు.

దాలిగుంటలో కుక్కసామెతే అయింది. అయితే ఈసారి కథల జోలికి వెళ్ళకుండా... తిరస్కరింపబడిన మూడు నాలుగు నవలలు దగ్గర పెట్టుకుని వాటిని బట్టీయంవేసి... ఓ

వేయిపేజీల నవలొకదాన్ని తయారుచేసి 'వేయి బుడగలు' టైటిల్ ఖరారుచేసి ఓ ప్రముఖ పత్రికకు పెన్ నేమ్‌తో పంపాడు కాశీపతి.

ఆ నవల పిచ్చ పిచ్చగ నచ్చేయటంతో 'వేయి బుడగలు' నవలను ప్రచురణకి అంగీకరించిందే తడవుగ సీరియల్‌గ ప్రచురించటం జరిగింది.

ఈసారి ఆకాశరామన్న ఉత్తరాలు కాకుండా... ముగ్గురు నవలా రచయితలు పత్రికాఫీసుకొచ్చి ఎం.డి.గారిని స్వయంగా కలిసి... తాము పరిశీలనకై పంపిన నవలలను ఎవరో కాపీకొట్టి టైటిల్ 'వేయి బుడగలు'గ మార్చి మరో పత్రికలో తన స్వంత నవలగా అచ్చేసుకుంటున్న విషయం గురించి ఫిర్యాదు చేసారు.

ఆ ముగ్గురు నవలా రచయితలకు నచ్చచెప్పి పంపించేసిన ఎం.డీ.గారు కాశీపతి కోసం కబురుపెట్టాడు.

కాశీపతి ఎం.డి.గారి ఎ.సి. రూమ్‌లోకి వచ్చి నిందితుడు బోన్లో నిలబడ్డట్టు తలొంచుకుని చేతులు కట్టుకుని అతి వినయంగ నిల్చున్నాడు.

ఎం.డి.గారి వళ్లు మండిపోయింది! సంగ్రహంగ అనలేం జరిగిందో వివరించి అప్పటికప్పుడు క్షణాల్లో కాశీపతిని ఉద్యోగంలోంచి 'డిస్మిస్' చేస్తున్న ఆర్డర్ కాగితం తెప్పించి పర్సనల్‌గ 'సర్వ్' చేసి ఎడంకాలితో (బాపుగారి కార్టూన్లోలాగ) ఒక్క తాపు తన్నటంతో రాకెట్లా గుమ్మం బైటికొచ్చిన కాశీపతి బోర్లపడ్డాడు.

ఇక్కడితో కథ కంచికెళ్ళలేదు. శుభం కార్డు పడ్లేదు.

సిగ్గు ఎగ్గూలేని కాశీపతి కాపీ బతుక్కి అలవాటు పడ్డవాడై... సారీ ఎడిక్టైనవాడై... సినిమా రంగంలోనైనా రాణించి నాలుగు డబ్బులు సంపాదించలేకపోతానానే ధైర్యంతో ఫిలిమ్ ఫీల్డ్‌ని ఎంచుకున్నాడు తన నెక్ట్స్ టార్గెట్‌గ!

ఇంకేముంది? తనలాంటి మేధావులకి అక్కడ బోలెడంత చోటు వుండడంతో ఇతర భాషా సినిమాలు కాపీ కొడుతూ సినీ రచయితగ స్థిరపడ్డాడు కాశీపతి!

తెలుగు సినిమా పరిశ్రమ కాశీపతిలాంటి మేధావని అక్కున చేర్చుకుని బ్రహ్మారథం పట్టింది!

- సమాప్తం -